సాక్షి ప్రకాశం

శనివారం। 10। ఆగస్టు। 2024

7



ఈ సవరణ.. అధికారిక కబ్జాకే..

కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టడంపై ముస్లింలలో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతోంది. - 8లో..



జిల్లా అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం

జిల్లా సమగ్రాభివృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, అందులో మహిళల భాగస్వామ్యం ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 38/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

మనసు కలచివేసింది



విజయవాడ అంబేద్కర్ స్మృతివనం వద్ద జరిగిన ఘటన దళిత ప్రజలందరి మనస్సులను కలచివేసింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన రిజర్వేషన్ ఫలాలతో ఎమ్మెల్యేలు, మంత్రులు అయిన ఈ నాయకులు ఏం చేస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహాన్ని కట్టించిన జగన్‌మోహన్ రెడ్డి పేరు ఉందనే నెపంతో విధ్వంసానికి పూనుకోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరుచుకోకపోతే ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి ఇల్లు సైతం ముట్టడిస్తాం. అంబేద్కర్ విగ్రహానికి హాని తలపెట్టిన వారిని శిక్షించేలా చర్యలు తీసుకోవాలి.

– బిళ్లా చెన్నయ్య, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు

దాడి దారుణం



విజయవాడ నడిబొడ్డున ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహంపై గురువారం రాత్రి అల్లరిమూకలు దాడులకు ప్రయత్నించడం హేయమైన చర్య. దీన్ని దేశంలోని ప్రజాస్వామ్యవాదులు అందరూ ఖండించాలి. అంబేద్కర్ అందరి అభ్యున్నతి కోసం కృషి చేశారు. విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహంపై దాడిచేసి పగులకొట్టేందుకు ప్రయత్నించిన వారిని కఠినంగా శిక్షించాలి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి.

– బూదాల సతీష్, దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు

దాడి క్షమించరాని నేరం



భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లాంటి మహనీయుడి విగ్రహంపై దాడికి పాల్పడటం క్షమించరాని నేరం. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. హోం మినిస్టర్ స్పందించి ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని పునరావృతం కాకుండా చూడాలి.

– కాటమాల చెన్నకేశవరావు, షెడ్యూల్డు కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు

న్యూస్‌రీల్

11న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ఒంగోలు: ఈనెల 11 నుంచి ప్రకాశం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నామని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పీ.రామచంద్రరావు, సెక్రటరీ ఎం వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపోటీల్లో అండర్–23లో భాగంగా 1 అక్టోబర్ 2001 నుంచి 13 సెప్టెంబర్ 2008 మధ్య జన్మించిన బాలబాలికలై ఉండాలని పేర్కొన్నారు. పోటీల్లో ఎంపికైనవారు ఈనెలలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని, వివరాలకు రాజు నాయక్ 76750 26220, గోపిచంద్‌రెడ్డి 80749 92796 లను సంప్రదించాలని వారు ప్రకటనలో కోరారు.

సెంట్రల్ జోన్ అథ్లెటిక్ పోటీలకు దోర్నాల బాలికల ఎంపిక



సెంట్రల్ జోన్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబర్చి సెంట్రల్ జోన్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికవడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 7వ తేదీ మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు శివలక్ష్మి, ధావణ్య, స్వాతి, కౌసల్య, డి.స్వాతి పాల్గొని ప్రతిభ చూపారని అన్నారు. సెంట్రల్ జోన్‌కు ఎంపికైన విద్యార్థులు సెప్టెంబర్ చివరి వారంలో అనంతపురంలో జరిగే సెంట్రల్ జోన్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, ఫిజికల్ డైరక్టర్లు రామానాయక్, హెచ్.రామానాయక్, నాగమూర్తి, విజమాణిక్యం, అనసూయదేవి తదితరులు అభినందలను తెలిపారు.

ప్రకాశం పంతులు జీవితం స్ఫూర్తిదాయకం

- ప్రకాశం పంతులు పుట్టిన గ్రామాన్ని సందర్శించిన ఏకేయూ వీసీ డీవీఆర్ మూర్తి



సభలో మాట్లాడుతున్న వీసీ మూర్తి

నాగులుప్పలపాడు: చిన్నతనం నుంచే చదువు మీద ప్రేమతో ఎన్నో కష్టాలు పడి జీవితంలో ఉన్నత స్థానానికి వచ్చిన స్వాతంత్ర్య సమర యోధులు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం చాలా మందికి స్ఫూర్తిదాయకమని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డి.వి.ఆర్ మూర్తి అన్నారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రకాశం పంతులు జన్మస్థలం అయిన వినోదరాయునిపాలెం గ్రామాన్ని సందర్శించాలన్న సంకల్పంతో మొదటిగా శుక్రవారం మండలంలోని వినోదరాయునిపాలెం గ్రామానికి వచ్చారు. టంగుటూరి ప్రకాశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ప్రకాశం విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించిన అనంతరం వీసీ డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ మహనీయుల త్యాగాలతో వచ్చిన స్వాతంత్ర్యం వలన ప్రస్తుతం మనం అనుభవిస్తున్న స్వేచ్ఛలో వారి కృషి ఎంతో ఉందన్నారు. ఆధునిక కాలంలో విద్యార్థుల చదువులో ప్రమాణాలు మారుతున్నందున విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా శిక్షణ అందించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మహనీయుల మంచి చరిత్రతో స్ఫూర్తి పొంది జీవితంలో ప్రతి విద్యార్థి ఉన్నత స్థానానికి వెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా వీసీ మూర్తికి గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఘట్టమనేని అశోక్, విజయభారతి విద్యాసంస్థల కరస్పాండెంట్ ఉన్నం చంద్రారావు, భైరపునేని సూర్యనారాయణ, హెచ్ఎం రమేష్, ఎస్ఎంసీ చైర్మన్ చిట్టిబాబు ఉన్నారు.

చీకటి దాష్టీకంపై ఎగిసిన నిరసన

రాష్ట్రంలో విద్వేషాలు పెచ్చరిల్లుతాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతి వనంపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి పూనుకోవటం దారుణం. ఇటువంటి చర్యల వలన రాష్ట్రంలో మత విద్వేషాలు పెచ్చరిల్లుతాయి. రాష్ట్రం ప్రభుత్వం స్మృతి వనంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి తన నిజాయితీని నిరూపించుకోవాలి.

– పాడిబండ్ల కోటేశ్వరరావు, కలికవాయ, సింగరాయకొండ మండలం

- పచ్చమూకల దుశ్చర్యపై మండిపాటు
- కులోన్మాదులను శిక్షించాలంటూ డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకాలు

అధికారంలోకి వచ్చిన వెంటనే మానవత్వాన్ని మరచి ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్న పచ్చమూకలు మహనీయుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం లక్ష్యంగా ఉన్మాద చర్యలకు పాల్పడడాన్ని ప్రజాసామ్యవాదులు గర్హించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన అధికారులు, పోలీసుల సమక్షంలోనే ఈ దుశ్చర్యకు తెగబడడాన్ని జిల్లాలోని అంబేద్కర్ ఆలోచనాపరులు ఖండించారు. రాష్ట్రానికే తలమానికంగా మహనీయుని విగ్రహాన్ని గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దారని, దానిపై కులోన్మాదులు దాడులకు పూనుకోవడంపై నిరసనలు వ్యక్తమయ్యాయి. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం బదులు రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని మండిపడ్డారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఈ దాడులకు పాల్పడిన సైకోలను వెంటనే అరెస్ట్ చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



సింగరాయకొండలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆదిమూలపు సురేష్



అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కనిగిరి మున్సిపల్ చైర్మన్ గఫార్, వైఎం ప్రసాద్‌రెడ్డి, కస్తూరిరెడ్డి, నాయకులు

సింగరాయకొండ: టీడీపీ రౌడీ మూకలు రాష్ట్రంలో విధ్వంసక పాలన సాగిస్తున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతివనంపై టీడీపీ మూకల దాడిని ఖండిస్తూ సింగరాయకొండ పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొంతకాలంగా రాష్ట్రంలో టీడీపీ నాయకుల అరాచకపాలన సాగుతోందని అన్నారు. గ్రామాల్లో ప్రారంభమైన ధ్వంస రచన, దాడులు చివరకు నేడు ఏకంగా దళిత జాతి తలెత్తుకునేలా అత్యంత ప్రతిష్టాత్మకంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నగర నడిబొడ్డున నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసే స్థాయికి చేరుకున్నాయన్నారు. టీడీపీ కార్యకర్తలు ఏవిధంగా బరితెగించారో దీన్ని బట్టి అర్థమవుతుందని, వారు ఎవరిని చూసుకుని ఈ ధ్వంస రచన చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల వరకు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేయడం, కూలగొట్టడం, వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై దాడులు చేయడం, హత్యలు చేయడం, చివరికి వైఎస్సార్ సీపీకి ఓటు వేశారన్న కారణంగా వారిని నిర్దాక్షిణ్యంగా కొట్టడం వంటి అరాచక చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్‌బుక్‌లో రాసిన ప్రకారం దాడులు అమలవుతున్నాయని, ఆ ప్రకారమే పోలీసులు నడుచుకుంటున్నారని విమర్శించారు. ఇటువంటి దుశ్చర్యలను ఆపకపోతే ప్రజలే వారికి బుద్ధిచెబుతారని మంత్రి సురేష్ హెచ్చరించారు. పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, మసనం వెంకట్రావు, షేక్ పటేల్, షేక్ కరీం, పఠాన్ రియాజ్, షేక్ ఆబిద్‌అలీ, మాదాల శంకర్, దాసరి శేషయ్య, పాలూరి శ్రీనివాసులరెడ్డి, చిమట తాతయ్య, గాలి బుజ్జి, షేక్ సుల్తాన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పచ్చమూకలను అరెస్ట్ చేయాలి

కనిగిరి రూరల్: రాష్ట్రానికే తలమానికంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై పచ్చమూకలు చేసిన చీకటి దాడిని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం కనిగిరిలోని ఒంగోలు బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పిలుపు మేరకు కటికట వెంకటరత్నం, చింతంగుంట్ల కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహంపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్నీ) మాట్లాడుతూ అంబేద్కర్ సామాజిక న్యాయ శిల్పాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయడాన్ని జీర్ణించుకోలేని టీడీపీ మూకలు దుర్మార్గంగా విగ్రహాన్ని ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాగానే రాక్షస పాలన సాగిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సూరసాని మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు దేవరాజ్, నక్కా రామకృష్ణ, పులి శ్రీనివాసులరెడ్డి, చింతం శ్రీనివాసులయాదవ్, ఎస్‌కే ఖాశింసా, పార్టీ మండల అధ్యక్షుడు జీ బొర్రారెడ్డి, ముజీబ్, రాజేంద్రారెడ్డి, మహిళా నాయకులు నాగూర్‌బీ, నాగమణి, షకీలా, మిట్టా రమేష్‌రెడ్డి, బాజీ, శ్రీను, గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: స్మృతివనంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కూలదోయడానికి యత్నించిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అప్పారావు, ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ర్యాలీగా స్థానిక కళా కేంద్రం సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ సుజన్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించి దోషులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మోరబోయిన సంజీవరావు, గుడ్లపాతల రవి, తేళ్ల పుల్లారావు, నారా సుబ్బారెడ్డి, మద్దా లక్ష్మీనారాయణ, సురేష్, శ్రీకాంత్, రామాంజనేయులు, అరుణ, రజని, జయమ్మ, మస్తానమ్మ, పిట్టల ఆంజనేయులు, పిచ్చిరాజు, అన్వేష్, దుడ్డు వినోద్, గజేంద్ర, శ్రీకాంత్, హరిబాబు, శింగయ్య పాల్గొన్నారు.

మహనీయుని విగ్రహాన్ని కాపాడాలి

ఒంగోలు: విజయవాడ నగర నడిబొడ్డున నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం ముమ్మాటికి దుశ్చర్యే అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్ ఖండించారు. శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 204 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని నిర్మించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రపంచ ఖ్యాతిని ఆర్జించిందన్నారు. కానీ నేడు ఆ విగ్రహాన్ని ఆవిష్కరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం సరికాదన్నారు. అధికారులు, ఉద్యోగులు, పోలీసుల సమక్షంలోనే ఈ విధ్వంసం జరగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇందుకు కారకులైన వారిని, అందుకు సహకరించిన వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉన్నం జనార్దన్‌రావు మాట్లాడుతూ మహనీయుని విగ్రహం వద్ద దుశ్చర్యకు పూనుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొమ్మినేని మురళి, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, సూర్యబలిజ, కృష్ణబలిజ, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు దాసరి కరుణాకర్, తిర్లిక శ్రీనివాసులు, గోనుగుంట్ల రజని, కార్పొరేటర్లు గోపిరెడ్డి గోపాల్ రెడ్డి, అంగిరేకుల గురవయ్య, గంగవరపు ప్రవీణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ బొమ్మినేని మురళి, సాంస్కృతిక విభాగం జోనల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బాలిశెట్టి నాగేశ్వరరావు, ఉన్నం జనార్దన్‌రావు, రాయపాటి అంకయ్య, కారంశెట్టి కిరణ్‌కుమార్, సుతారం శ్రీనివాసులు, పత్రా బంగారం, బడుగు కోటేశ్వరరావు, స్వరూప్, జయరావు, కోటి యాదవ్, మోదుబోయిన సురేష్‌యాదవ్, తోటపల్లి సోమశేఖర్, ఒంగోలు బుజ్జి పాల్గొన్నారు.



ఒంగోలులో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మద్దిపాడులో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

నిందితులను అరెస్టు చేయాలి



గంటా సుబ్బారావు, చప్పిడి వెంగళరావు

ఒంగోలు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం సరికాదని, తక్షణమే అందుకు కారకులైన వారందరినీ అరెస్టు చేయాలని దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున నిర్మితమైన 204 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం ప్రపంచ వ్యాప్తంగా అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. మహనీయుని కోసం నిర్మించిన ప్రాంగణంలోని ప్రతి అణువు ఆయన సొంతమే అన్నారు. అటువంటి ప్రాంగణంలో జరిగిన విధ్వంస రచనను ప్రతి ఒక్క ప్రజాస్వామిక వాది ఖండించాలని కోరుతున్నామన్నారు. ఇటువంటి వారిని తక్షణమే అరెస్టు చేయకపోతే ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గిరిజన బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహ ప్రాంతంలోకి సుత్తులు, రాడ్లు వంటి ఉపకరణాలతో అడుగుపెట్టారంటే వారిలో మానవత్వమనేదే లేదన్నారు.

రాష్ట్రంలో పాలన ఉందా లేదా..



సామాజిక న్యాయ మహాశిల్పం బోర్డు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేరును దుండగులు ధ్వంసం చేయడం దుర్మార్గపు చర్య. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంలో భాగంగానే దుండగులు ఇలాంటి చర్యలకు ఉపక్రమించి ఉంటారనిపిస్తోంది. నగర నడిబొడ్డున ఉన్న ఇలాంటి కట్టడాలు, మహోన్నతుల విగ్రహాలకే రక్షణ లేదంటే రాష్ట్రంలో ప్రభుత్వం, పాలన ఉందా లేదా అనే సందేహం కలుగుతోంది. తక్షణం బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలి. లేకపోతే ఇది ప్రభుత్వ పెద్దల పనిగానే భావించాల్సి ఉంటుంది.

– సూరిపోగు మాల్యాద్రి, ఎస్సీసెల్ నాయకులు, పామూరు


టీడీపీ అల్లరి మూకల దాడి దారుణం



అంబేడ్కర్ స్మృతి వనంపై టీడీపీకి చెందిన అల్లరి మూకలు దాడి చేయడం దారుణం. ఇటువంటి దాడులను రాష్ట్ర ప్రభుత్వం అణచివేయకుండా ప్రేరేపించడం మంచి పరిణామం కాదు. అంబేడ్కర్ స్మృతి వనం పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి మరెప్పుడూ ఇటువంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుని ప్రజల మనోభావాలను కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

– పఠాన్ రియాజ్, సింగరాయకొండ


సామాజిక న్యాయ శిల్పంపై దాడి హేయమైన చర్య



రాష్ట్రానికే తలమానికంగా విజయవాడలో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నిర్మించిన సామాజిక న్యాయ శిల్పం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహంపై దాడి హేయమైన చర్య. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇలాంటి పనుల వలన ప్రజల్లో తీవ్రంగా వ్యతిరేకత మూటకట్టుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– పీ సుబ్రహ్మణ్యం, త్రిపురాంతకం


నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి



విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడి చేయడం హేయమైన చర్య. రాజకీయాలకు తావులేకుండా అన్ని వర్గాలకు చెందిన వారు ఈ స్మృతి వనాన్ని సందర్శిస్తున్నారు. అటువంటి వనంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని కూలదోసేందుకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– బొందలపాటి కొండయ్య, దళిత సంఘ నాయకుడు, గంజివారిపల్లి

మహోన్నతునికి అపచారం



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పట్ల పచ్చ మూకలు చేసిన అపచారం అమానుషం. అధికారం ఇచ్చింది ప్రజలకు ఏదో మంచి చేస్తారని. అంతేకాని గిట్టని వారిపై, విగ్రహాలపై దాడులు చేయటం కాదు. దళిత వర్గాలు దేవునిగా ఆరాధించే మహోన్నతుని పట్ల వ్యవహరించిన తీరు సరికాదు. మహాశిల్పం బోర్డు, విగ్రహం ఏర్పాటు చేసిన మాజీ సీఎం జగన్ పేరు ధ్వంసం చేసినంత మాత్రాన పేదల, దళితుల హృదయాల్లో వారి స్థానాన్ని ఎవరూ ఏమీ చేయలేరు.

– స్వప్న వినోద్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, పొదిలి

మూడు రంగుల అరుదైన పక్షి



మునియా పక్షి

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని ఒక ఇంజినీరింగ్ కళాశాలలోని చెట్టుపై మునియా పక్షి ప్రత్యక్షమైంది. మూడు రంగుల్లో పక్షి ఉండటంతో దీనికి త్రివర్ణ మునియా అంటారని స్నేక్ క్యాచర్ నిరంజన్ తెలిపారు. కనిపించకుండా పోతున్న పక్షి జాతుల్లో త్రివర్ణ మునియా జాతి ఒకటని చెప్పారు. కళాశాల ప్రాంగణంలో చెట్లపై ఈ పక్షిని గమనించిన విద్యార్థులు అటవీశాఖకు సమాచారం ఇవ్వటంతో నిరంజన్ పరిశీలించి ఫొటోలు తీశాడు. మన దేశంతో పాటు బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్‌లలో ఈపక్షి సంచరిస్తూ ఉంటుంది. ముఖ్యంగా చిరుధాన్యాలను తిని జీవిస్తుంది. తడి గడ్డి భూముల వద్ద నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటుంది. ఈపక్షి శరీరం నలుపు, తెలుపు, చెస్ట్ నట్ రంగుల్లో ఉంటుంది. పక్షి ఆవాసాలను ఏర్పాటు చేసుకునేందుకు ఆడ, మగ పక్షులు కలిసి నిర్మించుకుంటాయి. మానవ నివాసాలకు దూరంగా ఉండేలా చూసుకుంటాయి. గూడు లోనికి ప్రవేశించటానికి ఒక చిన్న ద్వారం ఏర్పాటు చేసుకుని ఓవల్ ఆకారంలో ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. వీటి గుడ్లు కూడా ఓవల్ ఆకారంలో తెలుపు రంగులో ఉంటాయి. ఇవి మూడు రంగుల పక్షులు కావటంతో వేటగాళ్లు బంధించి అమ్ముతుంటారు. వీటిని తీసుకువెళ్లి పంజారాల్లో బంధించి నివాసాలలో చాలా మంది పెంచుకుంటారు.



చెట్లపై ఉన్న మునియా పక్షి

శిశుగృహలోని చిన్నారుల దత్తత వేగవంతం చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: శిశుగృహలో ఆరేళ్ల లోపు చిన్నారుల దత్తత ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను సూచించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో బాలసదన్, శిశుగృహ అధికారులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్ లీగల్ దత్తత రికార్డులు వారంలో పూర్తి చేయాలని ఆదేశించారు. బాలసదనంలో పిల్లలు మొత్తం స్కూలుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలల సరంక్షణ విభాగం బాలల సంక్షేమ కమిటీ సమన్వయంతో శిశుగృహలోని పిల్లలను త్వరితగతిన దత్తతకు ఇవ్వాలని ఆదేశించారు. దీనిలో బాలల సంక్షేమ కమిటీ సభ్యులు నీలిమ, వంశీలత, శివ శంకర్, సుమనశ్రీ, బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్, డీపీవో బాలప్రభాకర్, లీగల్ అధికారి రత్నప్రసాద్, శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

బడి వయసు పిల్లలు బడికి వెళ్లాలి

బడి వయసు ఉన్న పిల్లలంతా పనులకు కాకుండా తప్పనిసరిగా బడికి వెళ్లాలని ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ప్రకాశంభవనంలో లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. లేబర్ డ్రైవ్‌లో గుర్తించిన పిల్లలను తిరిగి స్కూల్‌కు పంపాలని పనులకు పంపిన తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.దీనిలో డీఎంహెచ్‌ఓ సురేష్, డీఈఓ సుభద్ర, జిల్లా లేబర్ అధికారి, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, చైల్డ్ వెల్ఫేర్ అధికారి దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువ రైతు కుటుంబానికి బూచేపల్లి పరామర్శ



నాగార్జున కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి: ఇటీవల అప్పుల బాధతో పోతవరం గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న యువ రైతు నాగార్జున కుటుంబాన్ని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. నాగార్జున మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. అండగా ఉంటానని, అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. వారికి రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బూచేపల్లిని కలిసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కుమ్మిత అంజిరెడ్డి, గ్రామ నాయకులు కోరే సుబ్బారావు, తిరుమలకొండ తదితరులు పాల్గొన్నారు.

లారీ అతివేగానికి ఒకరు బలి



ప్రమాదంలో మృతి చెందిన వీరారెడ్డి

కనిగిరి రూరల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం కనిగిరి–కొత్తూరు మధ్య పెట్రోల్ బంక్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తూరుకు చెందిన కె.వీరారెడ్డి(45) వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై కనిగిరి పట్టణానికి వచ్చాడు. పని ముగించుకుని కొత్తూరుకు వెళ్తున్నాడు. అదే సమయంలో కనిగిరి నుంచి పామూరు వైపు వేగంగా వెళ్తున్న లారీ.. బైక్‌ను ఓవర్ టేక్ చేయబోయి వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైక్ నుంచి పడిపోయిన వీరారెడ్డి మీదుగా లారీ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన లారీని, ఘటనా స్థలంలో రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా నిలబెట్టి ఉన్న పొక్లెయిన్‌ను పోలీసులు సీజ్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.358

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో శుక్రవారం పొగాకు గరిష్ట ధర కేజీ రూ.358 పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాలకు 10,139 బేళ్లు రాగా 8,538 బేళ్లు కొనుగోలయ్యాయని, వ్యాపారులు వివిధ కారణాలతో 1,601 బేళ్లు తిరస్కరించారని వివరించారు. ఒంగోలు (పేర్నమిట్ట), వెల్లంపల్లి, ఒంగోలు–2, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 127వ రోజు వేలంలో 4,809 బేళ్లు రాగా 4,161 బేళ్లు కొనుగోలయ్యాయి. 648 బేళ్లను వ్యాపారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.358, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.310.45 పలికింది. కందుకూరు–1, 2, కనిగిరి, డీసీపల్లి, కలిగిరి, పొదిలి వేలం కేంద్రాల్లో 121వ రోజు వేలంలో 5,330 బేళ్లు రాగా 4,377 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 953 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.203, సరాసరి ధర రూ.292.88 పలికింది.

హైవేపై అదుపు తప్పిన వాహనాలు

- మూడు వాహనాలు ఒకదానికొకటి ఢీ
- ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



దూపాడు వద్ద ప్రమాదానికి గురైన వాహనాలు

త్రిపురాంతకం: జాతీయ రహదారిపై వాహనాలు అదుపు తప్పి ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలవగా సంఘటనా స్థలం భీతావహంగా మారింది. శుక్రవారం త్రిపురాంతకం మండలంలోని దూపాడు వద్ద సంభవించిన ప్రమాద వివరాలు ఇలా ఉన్నాయి. త్రిపురాంతకం వైపు నుంచి వెళ్తున్న పాల వాహనాన్ని కారు ఓవర్ టేక్ చేయబోయింది. అదే సమయంలో కుంట వైపు నుంచి కూరగాయల లోడ్‌తో వినుకొండ వైపు వెళ్తున్న వాహనం, మరో రెండు వాహనాలు అదుపుతప్పి ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో కూరగాయల వాహనంలో ప్రయాణిస్తున్న విశ్వనాథ్ తలకు తీవ్రంగా గాయమైంది. సాయి అనే యువకుడికి చెయ్యి విరిగింది. కారులో ప్రయాణిస్తున్న విజయ్‌కుమార్‌రెడ్డికి కాలు విరిగింది. కారులో మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదం ధాటికి వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. క్షతగాత్రులను వినుకొండ, త్రిపురాంతకంలోని ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ సవరణ.. అధికారిక కబ్జాకే..

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై నిప్పులు చెరుగుతున్న ముస్లింలు



- వక్ఫ్ చట్టానికి మద్దతిచ్చిన టీడీపీ, జనసేనపై తీవ్ర ఆగ్రహం
- నల్ల చట్టాన్ని వ్యతిరేకించిన వైఎస్సార్ సీపీ అభినందనలు
- జిల్లాలో మొత్తం 2774 ఎకరాల వక్ఫ్ భూములు
- కబ్జాకు గురైన భూములు 1236.22 ఎకరాలు
- ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికారుల చోద్యం

ఒంగోలు టౌన్: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టడంపై ముస్లింలలో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికే ముస్లింలకు చెందిన వక్ఫ్ బోర్డు పరిధిలోని వేలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమై ఉన్నాయని, వాటిని కబ్జాదారుల కోరల నుంచి విడిపించి ముస్లిం సమాజానికి అప్పగించాలని ముస్లిం మేధావులు, విద్యావంతులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సవరణ చట్టం కనుక అమలులోకి వస్తే ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా కబ్జా చేసిన వక్ఫ్ భూములన్నీ చట్టపరంగా కబ్జాలకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ముస్లింలకు ఎలాంటి సమస్యలు వచ్చినా తాను అండగా నిలబడతానంటూ నమ్మబలికిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముస్లిం సమాజాన్ని దెబ్బ తీస్తూ పార్లమెంటులో ప్రవేశ పెట్టిన వక్ఫ్ సవరణ చట్టానికి మద్దతు పలకడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంటులో ఈ నల్ల చట్టాన్ని వ్యతిరేకించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అభినందనలు తెలుపుతున్నారు.

కబ్జాలో జిల్లాలోని వక్ఫ్ భూములు:

ప్రకాశం జిల్లా వక్ఫ్‌లో మార్కాపురం, కనిగిరి, ఒంగోలు డివిజన్లు ఉన్నాయి. మార్కాపురం డివిజన్‌లో మార్కాపురం, బేస్తవారిపేట, కొమరోలు, అర్ధవీడు, కంభం, గిద్దలూరు, రాచర్ల, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, తర్లుపాడు, పెద్దారవీడు మండలాలు ఉన్నాయి. ఈ డివిజన్‌లో 886.75 ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నాయి. అందులో కేవలం 174.78 ఎకరాల భూమి మాత్రమే ఇప్పుడు వక్ఫ్ బోర్డు ఆధీనంలో ఉంది. మిగతా భూమంతా కబ్జాలకు గురైంది. కనిగిరి డివిజన్‌లో కనిగిరి, పొదిలి, వెలిగండ్ల, చంద్రశేఖరపురం, పామూరు, దర్శి, కురిచేడు, పొన్నలూరు, హనుమంతునిపాడు, కొనకనమిట్ల, దొనకొండ, మర్రిపూడి మండలాలు ఉన్నాయి. ఈ డివిజన్‌లో 869.08 ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నాయి. ఇందులో కేవలం 584 ఎకరాల భూములు మాత్రమే వక్ఫ్ బోర్డు ఆధీనంలో ఉంది. ఒంగోలు డివిజన్‌లో ఒంగోలు, ముండ్లమూరు, జరుగుమల్లి, సింగరాయకొండ, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, చీమకుర్తి, కొండపి, తాళ్లూరు, సంతనూతలపాడు, మద్దిపాడు, టంగుటూరు మండలాలు ఉన్నాయి. ఈ డివిజన్‌లో 1019.07 ఎకరాల వక్ఫ్ భూమి ఉంది. అందులోంచి 779.08 ఎకరాలు కబ్జాకు గురైంది.

యథేచ్ఛగా కబ్జా.. పట్టించుకోని పాలకులు..

జిల్లాలోని 2,774.08 ఎకరాల వక్ఫ్ భూముల్లో 1236.22 ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయి. ఇంత పెద్ద మొత్తంలో వక్ఫ్ భూములు కబ్జాకు గురైనా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు. కేవలం నోటీసులు ఇచ్చి మమ అనిపిస్తున్నారు. ముస్లిం ప్రజా సంఘాలు ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారుల నుంచి సరైన స్పందన లేకుండా పోతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులకు చేతులు తడిపి కోట్ల విలువైన భూములను కాజేస్తున్నారు.

వక్ఫ్ ఆస్తులు ఆక్రమణకు గురయ్యే అవకాశం



ఎన్నో ఏళ్లుగా కాపాడుకుంటూ వస్తున్న వక్ఫ్ ఆస్తులు రక్షణ కోల్పోయేలా కేంద్ర ప్రభుత్వ వక్ఫ్ బోర్డు బిల్లు ఉంది. ఇప్పటికే పలు చోట్ల విలువైన వక్ఫ్ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. వాటిని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

– మున్నా, చిన్నమసీదు కమిటీ అధ్యక్షుడు, కంభం

ఇది ముమ్మాటికి నల్ల చట్టమే



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం ముమ్మాటికీ నల్లచట్టమే. రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం. ఇప్పటికే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ముస్లింల ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోంది. ముస్లిం సమాజాన్ని విచ్ఛిన్నం చేసేందుకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

– షేక్ కరిముల్లా, న్యాయవాది, ఒంగోలు

వక్ఫ్ బోర్డు ఆస్తులపై ఇతరుల పెత్తనమేంటి?



వక్ఫ్ బోర్డు ఆస్తులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెత్తనం చెలాయించి తమకు అనుకూలమైన వారికి అప్పచెప్పేందుకు ప్రయత్నిస్తుంది. అందుకే పార్లమెంటులో వక్ఫ్ బోర్డు బిల్లు ప్రవేశపెట్టింది. ఈ బిల్లును వ్యతిరేకించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇతర పార్టీలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. వక్ఫ్ బోర్డు బిల్లుకు టీడీపీ సభ్యులు మద్దతు ఇవ్వడం సరయినదికాదు, అందుకు తాము వ్యతిరేకిస్తున్నాం.

– షేక్.కాశింసాహెబ్, ముస్లిం సంఘ నాయకుడు, యర్రగొండపాలెం

నేరుగా దాడి చేయడమే..



వక్ఫ్ సవరణ చట్టం నేరుగా ముస్లిం సమాజంపై దాడి చేయడం కోసం మోదీ సర్కారు చేస్తున్న ప్రయత్నం. ఈ చట్టానికి టీడీపీ ఎంపీలు మద్దతు పలకడం ఎంత మాత్రం సమర్థనీయం కాదు. ఎన్నికలకు ముందు ముస్లింకు ఎలాంటి అన్యాయం జరగకుండా చేస్తామని మాట ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు మాట తప్పారు. టీడీపీ కనుక ఈ చట్టాన్ని వ్యతిరేకించి ఉంటే మోదీ పునరాలోచనలో పడేవారు.

– ఎంఏ సాలార్, ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు

వక్ఫ్ చట్టాన్ని వైఎస్సార్ సీపీ వ్యతిరేకించడం శుభపరిణామం



వక్ఫ్‌బోర్డు భూములకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకుని రావటం దారుణం. ఇప్పటి వరకు ముస్లింలకు చెందిన వక్ఫ్‌బోర్డు భూములు భద్రంగా ఉన్నాయి. కాని ఈ ఆర్డినెన్స్‌ను పార్లమెంటు వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించడం శుభపరిణామం. వక్ఫ్‌బోర్డు భూములు కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పై ఉంది. కావున ముస్లింలకు వ్యతిరేకంగా కేంద్రం ఎటువంటి ఆర్డినెన్స్‌లు తీసుకుని రాకూడదని విజ్ఞప్తి చేస్తున్నాను.

– షేక్ కరీం, సింగరాయకొండ

గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కృషి

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డీబీవీ స్వామి
- ఆదివాసీ దినోత్సవ ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సెంట్రల్: గిరిజనుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలు గిరిజన భవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ.. గిరజనులందరికి ఆధార్ కార్డులు ఉండేలా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గిరిజన యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పించారు. గిరిజనుల కోసం ప్రత్యేక ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఔషధ శిబిరాన్ని ప్రారంభించారు. యర్రగొండ పాలెం, దోర్నాల, పుల్లల చెరువు మండలాల్లో 383 మంది చెంచులకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ చేశారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి జగన్నాథరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, డాక్టర్ బాలాజీ నాయక్, ఎస్సీ, ఎస్టీ, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పి. లక్ష్మయ్య, గిరిజన సంఘాల నాయకులు పేరం సత్యనారాయణ, మాల్యాద్రి, సైదా నాయక్, మోగన్న తదితరులు పాల్గొన్నారు. ప్రకాశం భవన్ నుంచి గిరిజన భవన్ వరకు చేపట్టిన ర్యాలీని కలెక్టర్‌తోపాటు మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.



అంబేడ్కర్, గిరిజన పోరాట వీరులకు నివాళులు అర్పిస్తున్న మంత్రి డోలా, కలెక్టర్, అధికారులు

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



సంఘటనా స్థలంలో శివారెడ్డి మృతదేహం

మర్రిపూడి: విద్యుదాఘాతానికి గురై కౌలు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని చిమట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిమట గ్రామానికి చెందిన కౌలు రైతు గొంగటి శివారెడ్డి(45)కి రెండు ఎకరాలు భూమి ఉంది. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్నాడు. శుక్రవారం నారుమడికి నీరు పెట్టేందుకు వెళ్తున్న క్రమంలో పొలం గట్టు నుంచి జారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలపై పడిపోయాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివబసవరాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం కుట్రపై నేడు నిరసన

- హాజరు కానున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

దర్శి: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం శిలాఫలకం పగులగొట్టి అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసే కుట్రలకు దర్శిలో నేడు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరవుతారన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తారన్నారు. అంబేడ్కరిస్టులు, దళిత ప్రజాసంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఆకాశవాణి 31వ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న ప్రోగ్రామ్ హెడ్ ప్రశాంత్ కిరణ్ తదితరులు

మార్కాపురం: మార్కాపురం ఆకాశవాణి కేంద్రం 31వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ప్రోగ్రాం హెడ్ పి.ప్రశాంత్ కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 31 సంవత్సరాలుగా మార్కాపురం ఆకాశవాణి కేంద్రం రైతులు, యువత, మహిళలు, చిన్నారుల కోసం వేలాది కార్యక్రమాలు ప్రసారం చేసిందని, వారిని చైతన్యవంతులు చేసే విధంగా ప్రముఖుల ఇంటర్వ్యూలను శ్రోతలకు అందిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ రంగాల కళాకారులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజ్ఞానంతోపాటు వినోదాన్ని కూడా శ్రోతలకు పంచుతుందన్నారు. ప్రధానంగా వ్యవసాయ రంగ అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా ఆధునిక పద్ధతులు, శాస్త్రవేత్తల సలహాలు, అధికారుల సూచనలు ప్రసారం చేస్తున్నామన్నారు. యువత కోసం ఉద్యోగ సమాచారాన్ని ప్రసారం చేస్తున్నామని, మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ శ్రోతలను అలరిస్తున్నట్లు చెప్పారు. ఆకాశవాణి కేంద్రం అభివృద్ధిలో క్యాజువల్ అనౌన్సర్ సేవలు మరువలేమన్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణ, సీనియర్ జర్నలిస్టు మూలా అల్లూరెడ్డి మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలకు పైగా ఉత్తమ ప్రసారాలు అందిస్తూ ఆకాశవాణి మార్కాపురం కేంద్రం ప్రజలకు మరింత దగ్గరైందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు ప్రజలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, ప్రోగ్రామ్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు అందించారు.

జిల్లా అభివృద్ధిలో మహిళలు కీలకం



జిల్లా అధికారులు, బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: అన్ని రంగాల్లో 2047 నాటికి జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని, అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కావడం అత్యంత కీలకమని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు రుణాలు ఇచ్చి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 9500 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలతో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.133 కోట్ల పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించేలా చేయాలనేది తమ లక్ష్యమని తెలిపారు. ప్రతి మహిళ లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టేలా చూడాలన్నారు. లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించారు. పేదరికం లేని జిల్లా ఆవిష్కృతం అయ్యేందుకు బ్యాంకర్లు తమవంతు పాత్ర పోషించాలన్నారు. ఆర్థిక పరమైన సమస్యలు ఉంటే ఎల్‌డీఎంలతో డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, ఎల్‌డీఎం రమేష్, నాబార్డు డీడీఎం రవికుమార్, ఏపీఎంఐపీ పీడీ రమణ, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ అధికారి గోపిచంద్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, పశుసంవర్థక శాఖ అధికారి బేబిరాణి, పీడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ శ్రీనివాస్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాయ చేసి.. బంగారం కాజేసి..

- మహిళ నుంచి 10 సవర్ల ఆభరణాలు కాజేసిన దుండగులు
- టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఘటన

టంగుటూరు: జాతీయ రహదారి పక్కన ఆటో కోసం వేచి ఉన్న ఓ మహిళను గుర్తు తెలియని వ్యక్తులు మాయ చేసి 10 సవర్ల బంగారు ఆభరణాలు(తాడు 3 సవర్లు, గాజులు 5.30 సవర్లు, కాశీ కాయలు 1.30 సవర్లు, పచ్చరాయి ఉంగరం 5 గ్రాములు) అపహరించారు. ఈ సంఘటన శుక్రవారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం వద్ద చేటుచేసుకుంది. వివరాలు.. కొండపి మండలం చోడవరం గ్రామానికి చెందిన బాలునేని వెంకటరమణ తూర్పునాయుడుపాలెంలోని బంధువుల ఇంటికి వచ్చింది. స్వగ్రామానికి వెళ్లేందుకు జాతీయ రహదారి సమీపంలో ఆటో కోసం వేచి ఉంది. ఆమె మెడలో బంగారాన్ని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు రహదారిపై తనిఖీలు చేస్తున్నారంటూ మాయ మాటలు చెప్పారు. బంగారాన్ని ప్యాక్ చేసి ఇస్తామనడంతో నిజమేనని నమ్మి నగలు తీసి ఇచ్చింది. పేపర్ ప్యాకెట్ ఆమె చేతికి ఇచ్చిన దుండగులు అక్కడి నుంచి ఉడాయించారు. ఆటో ఎక్కి టంగుటూరులో దిగిన ఆమె పేపర్ ప్యాకెట్ తెరిచి చూడగా రాళ్లు కనిపించాయి. ఒక్కసారిగా కంగుతిన్న ఆమె బోరున విలపించింది. కుటుంబ సభ్యులతో కలిసి టంగుటూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై పున్నారావు చెక్ పోస్ట్ ఏర్పాటు చేయించి తనిఖీలు చేపట్టారు. నిందితుల జాడ కోసం టోల్ ప్లాజా వద్ద సీసీ ఫుటేజ్ పరిశీలిస్తున్నారు.

మోదీ ప్రభుత్వం.. కార్పొరేట్లకు ఊడిగం



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘ నాయకులు

ఒంగోలు టౌన్: దేశ ప్రజల నెత్తురును పీల్చి పిప్పి చేస్తున్న బడా కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించాలని, వారి దోపిడీని తిప్పి కొట్టాలని రైతు సంఘం నాయకులు జీవీ కొండారెడ్డి, సిద్ధిపేట వెంకటేశ్వర్లు, లలిత కుమారి, కొత్తకోట వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు వ్యవసాయ రంగం నుంచి కార్పొరేట్లను తరిమివేయాలంటూ శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతు నాయకులు ప్రసంగిస్తూ.. బీజేపీ ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు కోట్లాది రూపాయల రాయితీలు ఇచ్చి రుణాలు మంజూరు చేస్తూ.. పేదల మీద వివిధ రూపాల్లో పన్నుల భారం మోపుతోందని మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతు నోట్లో మన్ను కొడుతున్న ఎన్డీఏ ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులను 10 రెట్లు ఎక్కువగా అమ్ముకుంటున్న కార్పొరేట్లకు మాత్రం రాయితీలు ఇస్తోందని దుయ్యబట్టారు. రుణాలు ఎగ్గొట్టిన పారిశ్రామికవేత్తలక మళ్లీ రుణాలు మంజూరు చేస్తున్న మోదీ ప్రభుత్వం ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించమంటే పోలీసులను ఉసిగొల్పుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, అన్ని రకాల పంటలకు సంబంధించిన ఉత్పత్తులను విక్రయించే బడా కంపెనీలను దేశం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవీఆర్ చౌదరి, కంకణాల ఆంజనేయులు, ఆర్.వెంకటరావు, సీఎస్ సాగర్, ఎమ్మెస్ సాయి, ఎంఏ సాలార్, నాగరాజు, ప్రకాశ్ రావు, ధనలక్ష్మి, బి.పద్మ, శ్రీరాం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.